

# తమసోమా జ్యోతిర్గమయా

ముకుందరావు శరీరంతో పాటే మనసు కూడా మొద్దు బారి పోయింది. ఈ మధ్యకాలంలో తరుచు మెదడుకి, మొత్తం శరీరానికే తిమ్మి రెక్కుతోంది పాపం. పూర్వం అయితే శరీరాన్ని ప్రేమించాలనే ధ్యాస వుండేది. నలగని బట్టలు, మాయని గడ్డం, చెరగని క్రాపు వొక విధమైన హుందా తనంతో పదిమందిని ఆకర్షిస్తూవుండేవాడు. మనసు కూడా "కాన్వెక్స్ లెన్స్"లా పనిచేస్తూ నచ్చిన మనుష్యుల్ని వింతగా చూపించేది. కాని యిప్పుడది మకిలి పట్టింది. పైగా అతక డానికి వీల్లేనన్ని బీటలు వారింది.

ఈన్నీ మార్పులు-యింకా అతనికి తెలియనివి, అందరికి తెలిసినవీ–జరగడానికి పదేళ్లు పట్టింది. కొందరి జీవితాలకు పదేళ్ళ కాలం చాలా స్వల్పంగా అన్పిస్తుంది. కాని యీ పదేళ్ళనే తల్చుకుని జీవితానుభవాల్ని ముద్దగా చిత్రించుకుంటూ ముకుందరావు "ఈ పదేళ్ళలో నేను యేదో ఒకరోజు చని పోయే వుండాలి. ఈ బ్రతకడం అనేది యాంత్రికంగా జరుగుతోంది. భయాన్ని మర్చి పోవడానికని చావుని గుర్తించడం లేదంతే" అనుకునేవాడు.

అతను బి.ఏ. ప్యాస్ అయి, పైచదువుకు వెళ్ళలేక ఆగిపోయినరోజుకు యీ రోజుకు మధ్యదూరం సరిగ్గాపదిసంవత్సరాలు. అతను ప్యాస్ అవగానే అన్నగారిచ్చిన 'రోలెక్స్' రిస్టువాచీ ప్రస్తుతం ముళ్ళు జారిపోతూ–కాలాన్ని మింగుతూ, కక్కుతూ మకిలి పట్టి అమ్మితే 'యిరవై పైన మాత్రం' ఖరీదు చేసేదానిలా అయిపోయింది. నాన్న కుట్టించిన బట్టలు యేనాడో చిరిగి పోయాయి. అనూరాధ యిచ్చిన 'మూడు కోతులు' మట్టి బొరి, అడుగు భాగాల్లో విరిగిపోయి అల్మైరాలో రోజూ కన్పిస్తూ అతన్ని యేమీ మాట్లాడనివ్వవు – విన నివ్వవు – చూడ నివ్వవు – గుండెల్లో కోత. తడి ఆనని గాయాలు మాత్రమే చేస్తూ.

అతని సర్వీసు రిజిష్టర్ చూస్తే, పదేళ్ళ గుమాస్తా జాతకంలో కొన్ని మధురఘట్టాలు ప్రొబేషన్ డిక్లేర్ అయినరోజు, యింక్రిమెంట్లు అందుకున్న తారీఖులు, మధ్య మధ్య సిక్ లీవుల పోస్టింగ్స్, ఆ తరువాత ఆఖరికి వో యూ. డీ. ప్రమోషన్ వైనం – కనిపిస్తాయి. శరీరం సంసారిగా అతన్ని మార్చింది యెనిమిది సంవత్సరాల క్రితం. ఇల్లాలుగా వచ్చిన అమ్మాయి అతను ప్రేమించిన అనూరాధే కావడం వొకటే ఆ గ్రంథంలో ప్రత్యేకత. అది తప్ప ముకుందరావు జీవితంలో ప్రాముఖ్యం వహించిన సంఘటనలు లేవా అనిప్రశ్నిస్తే-నిజానికి అతనూ యీ ప్రశ్నే చాలా సార్లు తన్ను తను వేసుకున్నాడు.

అనూరాధ అతనికి ముగ్గురు పిల్లల్నిచ్చింది. రెండు పూటలా శేరున్నర బియ్యం వండి వారుస్తోంది. వార్చలేని రోజున యేడుస్తూ – ఆ యేడుపు తగ్గిన తరువాత వార్చింది గాని, మానలేదు. ముకుందరావు చాలా సార్లు ఆమె కన్నీటిని చూశాడు. కొత్తలో అయితే వోదార్చేవాడు. తనే ఆమె కళ్ళు ఒత్తేవాడు. ఇప్పుడు ఆ పని చెయ్యడం అతనికి విసుగు. ఆ విసుగు కూడా ముదిరితే కొడతాడు, తిడతాడు....

ముకుందరావు ప్రేమించి పెళ్ళాడిన భార్యపట్ల విముఖతకు, యింటిపట్ల నిర్లిప్తతకు సగం కారణం అతని ప్రస్తుత ఆర్థిక సమస్యలే....

శ్రీసుధా

అతను నూట యిరవై రూపాయల జీతంలో తల్లిని, తండ్రిని, చదువుకుంటున్న తమ్ముణ్ణి, తన పిల్లల్ని, భార్యనీ పోషించాలి. మొత్తం యింట్లో జనాభా యినమండుగురు. మనిషికి ఖర్చు సగటున చూస్తే కళ్ళు భగ భగ మంటలు పుట్టేవి. నెలనెలా అప్పు చెయ్యక గడవదు. కొత్తలో అప్పు బాగానే పుట్టేది. కొంత కాలానికి అప్పు యిచ్చిన వాళ్ళు తిరిగి పొందని వారుగా మారి పోవడంతో, వట్టి చేతుల్తో యింటికి తిరిగి వచ్చిన ముకుందరావుకు యింట్లో మను ష్యులు జంతువుల్లా, జీభూతాల్లా కన్పించేవారు.

మనిషికి సగం మానసిక పతనం—లేమి వల్ల కల్గుతుందంటారు. కాని, మనిషిని వాస్తవంలో భయపెడుతూ, అంతకు రెట్టింపుగా కలల్లోనూ, ఆలోచనలలోనూ కూడా — మనిషికి వికృత దృశ్యాలు, భయ కర సంఘటనలు చిత్రించి చూపేది కూడా బీదరికమే అని వప్పుకుంటే, ముకుంద రావును చూస్తే నవ్వుకు ముందు జాలి, హాసానికి ముందు ఖరీదయిన కన్నీరు కార్చాలనిపిస్తుంది యెవరి కయినా. అతనికి యే డబ్బున్న స్నేహితుడో యెదురయి "ముకుందం యీ వందా ఖర్చు చేసుకో — నీకు బాగా కల్గినప్పుడు యివ్వు, తొందర లేదు" అంటే,

"నీ త్యాగం మర్చిపోను బ్రదర్ - చచ్చి నీ కడుపున పుడతాను" అనేవాడు.

అనూరాధను నిద్రలో లేపి "చూశావా అనూ: నన్ను అందరిలా నువ్వూ తప్పు అంచనా వేశావు. చూడు యీ పర్స్ - వెయ్యి రూపాయలు పైన వున్నాయి; నాకు దొరికింది. అలా చూడకు మరి. ఎవరూ మాదని ముందుకు రాలేదులే; నీకేం కావాలి"

అన్నట్టుగా యిలా రక రకాలుగా ఆలో చించు కోవడం, తద్వారా లభించే తృప్తిలో మునుగుతూ వుంటే, శరీరం హాయిగా పాటలు పాడేది.

మరుక్షణంలో శరీరం ఆకలితో రేగి నప్పుడో, అప్పులవాడు తిట్టి వెళ్లినప్పుడో, ముకుందరావు కుదించుకు పోయేవాడు. ఆలోచనలు ఎంత కాదనుకున్నా చేదులోకి మారేవి.

"అవును.... అమ్మ యేడాది నుంచి మంచానవుంది. మందు లేదు. డాక్టరు కూడా 'లాభం లేదు' అని యేదో రోజు — ఆ మాట కాస్తా అనేస్తాడు.... అయితే అమ్మని చచ్చిపోకుండా తను ఆపలేడు.... వొక వేళ అమ్మ రేపు చచ్చిపోతే? తన దగ్గర యేం డబ్బు వుందని? కర్మకి చాలా అవుతుందంటారు. వంద రూపాయలైనా కావాలి. చుట్టాలొస్తారు. వీధిలో శవాన్ని తనెలా కదిలిస్తాడు.... ఎవర్ని అప్పడగాలి అప్పుడు? యెవరూ డబ్బివ్వక పోతే తనేం అమ్ముకోవాలి ?

అనూరాధకు మళ్ళీ ప్రసవం రోజులు. క్రితం సారే వాతం కమ్మింది. మళ్ళీ వస్తుందేమో. చచ్చిపోదు కదా. ..శేషాద్రి వద్ద అప్పు చేసిన సొమ్ముకు అతను కోర్టుకు లాగితే తన దగ్గరేం వుందని? అప్పుడు ఖైదులో పెడతారు. అయితే—యిల్లెలా నడుస్తుంది? అమ్మా, అనూరాధా ఆ యింట్లో యీ యింట్లో వంటలక్కలుగా చేరి పొగ చూరిపోయి వారానికొక సాయంత్రం తన్ను చూడ్డానికి వస్తారు....



ముకుందరావును యేడాదిగా యీ రక రకాల ఆలోచనలు తేనెటీగల్లా చుట్టుముట్టి, అతను యే రోజూ సుఖ నిద్ర పోకుండా జాగ్రత్తపడుతున్నాయి. అతను యెన్నో రాత్రుళ్ళు వంటరిగా, గుండెల్లో వెక్కిళ్ళలా విచారం తన్నుకు వస్తూంటే యేడ్చేసేవాడు.

ఎలాగో అణా మల్లె పువ్వులతో, పగటి పూట శ్రమనంతా మర్చిపోయి యింటికి వచ్చేవాడు. గదిలోకి వెళ్ళేటప్పటికి నూనె తగ్గిపోయి భగ భగ మంటున్న కోడి గుడ్డు లాంపు. ఇటు టేబుల్ క్లాత్ కొబ్బరి నూనె డాగులతో, కాటుక మరకలతో, మబ్బు పట్టిన ఆకాశంలా వుండేది. గోడ మీద చెద తినగా మిగిలిన భాగాల్లోంచి వంశాన్ని వృద్ధిచేసిన పెద్దలు-చిమ్మెట్లు తినేసి మిగిల్చిన అవయవాలతో ఫొటోల్లో వికృతంగా కన్పించేవారు. అతనికి వెన కటి రోజులు గుర్తుకు వచ్చేవి. చదువుకునే రోజుల్లో కన్న కలలు—అనూరాధ ప్రేమి కుడిగా, యెన్నో సాయంకాలాలు కాలేజీ పొన్న మామిడి చెట్ల కింద బృందావనాలు వూహించుకున్న క్షణాలు గుర్తొచ్చి, వాటికి ప్రతిగా పొందింది యేమిటో వాస్తవంలో జీభూతంలా కళ్ళముందు నాట్యం చేస్తూంటే అగ్ని పర్వతం లాంటి శరీరం బ్రద్దలు కావడానికి సిద్ధమయ్యేది. దానికితోడు క్రితం రోజు చీర విప్పకుండా, జడైనా వేసుకోక, సంవత్సరాలుగా గలేబు యెరగని తలగడాకు పట్టిన మకిలి మీద చెయ్యి పెట్టు కుని "జీవితం యిందుకేనా.... మరెందు కైనా వుందా" అనే మీమాంసతో, ఆశలు, వూహలు, ఆహ్వానాలు అన్నీ మర్చిపోయి వట్టి మనిషిగా, భార్యగా, పడుకున్న అనూ రాధను చూస్తే— అతనికి శరీరం పట్టు తప్పిపోయేది. మెదడు బరువెక్కి, దాధలు గొంతును పట్టుకునేవి. ఏ అలజడి లేని వట్టి గుండె కదలికను మాత్రమే మిగుల్చు కున్న ఆ స్త్రీని తయారుచేసింది తనేనని

---

● ఒక పెద్దమనిషి బుద్ధిపొరపాటై ఒక తర్కశాస్త్ర పండితుడితో తగూ పెట్టుకున్నాడు. ఈయన 'ఎద్దేం' అంటే కాదు 'తెద్దేం' అని ఆ తర్కశాస్త్రిగారు హోరాహోరీగా వాదించి ఈయనను హూనంహూనం చేశాడు. పెద్దమనిషికి ఏడుపొచ్చేస్తూంది. ఆఖరి ప్రయత్నంగా 'రెండు రెళ్ళు ఆరు' అని గట్టిగా గావుకేకపెట్టాడు. తర్కశాస్త్రపండితుడుగారు 'కాదు, నాలుగు' అని ప్రతిధ్వనిం చాడు. 'కాదు ఆరే రైటు, కావలిస్తే నిరూపించు' అని సవాలుచేశాడు పెద్దమనిషి. త.శా.పం, గారు ఈ చేతివేళ్ళు రెండు,. ఆ చేతివేళ్ళు రెండు తెరిచి, రెండింటినీ దగ్గరకు చేర్చి మొత్తం కలిపి లెక్కపెట్టి 'నాలుగు' అన్నాడు. పెద్దమనిషి "అవి నాల్గు ఎందుకు అవును, ఆరు ఎందుకు కావు" అన్నాడు. దమ్ముంటే నిరూపించమన్నాడు. త.శా.పం. గారు హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్టు అభినయించి, అర్జెంటు పనుందని వెళ్ళిపోయాడు.

నీతి : కొందరికి రెండు రెళ్ళు ఆరే.

గుర్తు చేసుకోగానే, పెళ్ళి అనాలని పించేది. "అనూరాధా! నిన్ను సర్వ నాశనం చేశాను. నేను నాశనం అయినందుకు నాకు బాధ లేదు. ప్రేమించినందుకు ప్రతిగా మగవాడు యెంతగా శిక్షిస్తాడో, తెలిసి నిన్ను చూస్తే యే ఆడది యే మగవాణ్ణీ ప్రేమించదు. లేమిని అసలే ప్రేమించదు. యే జన్మ లోనో నే చేసిన పాపాలకి శిక్షగా నిన్నిలా మార్చేశాడు భగవంతుడు...." కళ్ళు కన్పించేవి కావు.... అలాగే ముద్దగా వుండి పోయేవాడు.

● ● ●

ముకుందరావు చూచిన మార్పులన్నీ అనూరాధలో వాకేసారిరాలేదు. చాలారకాల ఈర్ష్యల వడగాడ్పులు, పోట్లాటల పెను తుఫానులు,పట్టుదలలశ్లోణీపాతవర్షాలుఅన్నీ కలిగాయి. తనకోసం ఏ ఆనందాన్ని పణంగా పెట్టలేని భర్త -అవకాశంలేక బియ్యం మధ్య హరించుకు పోతున్న హారతి కర్పూరంలా అయిపోతూంటే - ఆ పురుషుడి పట్ల జాలి, మరో పెడ అతని అసమర్ధతకు విముఖతా కల్గేవి. వీటన్నిటికి కారణమయిన సంసారం మీద అసహ్యం కలిగేది.

పుట్టిన పిల్లల్లో వొకడు బిల్లతో, మరొ కడు అనాసతో గిలగిల్లాడుతూ - గిలిగిచ్చ కాయ కోసం వొకళ్ళు నొకళ్ళు కరుచు కుంటూంటే "వీళ్ళని కన్నది నేను కాదు భగవంతుడా-నువ్వు. నేనుసిగ్గుపడుతున్నాను నువ్వు ప్రాణం యిచ్చిన పిల్లల్ని నా వాళ్ళు అని నింద మోస్తున్నందుకు" అనుకునేది కక్ష కలిగితే. భర్త చేతకాని తనం మీద కోపం ఆమెకు అద్దం ముందు నుంచుని తన రూపం చూచుకున్న రోజున మరీ యెక్కువయ్యేది. అలాగే అనేసేది "చూడండి - మిమ్మల్ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు అనూరాధలో యేం మిగిలిందో"

కాని తనకి నిద్ర పట్టక, నిద్రపోతున్న ముకుందరావును చూస్తే యెందుకో శరీరంలో అఖరి శకలంగా మిగిలిన అనురాగం కదిలి జాలీ పుట్టుకొచ్చేది. ఎండిపోయిన ఆకట్టైనే గుండెల కదుముకుని నేనే కాదు. జీవితం కూడా మిమ్మల్ని రోజూ తినేస్తోంది. దేనికైనా ఆడదానికి అదృష్టం వుండా లంటారు-నేను శని పీనుగుని. ఇంకెప్పుడూ మిమ్మల్ని యేమీ అనను, నిజం" అనేది.

ముకుందరావును పెళ్ళి చేసుకున్న రోజుల్లో అనూరాధ శరీరాన్ని, ఆశల్ని శల్య పరీక్ష చేస్తే వాటిలో యీ నాడు కన్పించేకలతలు, ద్వేషాలు, అసహ్యాలు తత్ సంబంధమైన బీజాలుకూడా కన్పించేవికావు.

నిజం చెప్పాలంటే,అనూరాధే ముకుంద రావు కన్న చాలా విషయాల్లో వోర్పు కన పరచేది. భర్త ఆవేశపడి తిడుతున్నప్పుడు, కొట్టి వెళ్ళిపోయిన తరువాత, తన కర్మని దూషించుకుని కొంతకాలం - లేకపోతే ఆయన్ని తను ప్రేమించి పెళ్ళిచేసుకున్నా ననే భావనా తెచ్చుకుని - పుట్టబోయే ఆవే శాన్ని ఆదిలోనే తుంచేసేది.

రేపటిరోజు యీ రోజు కన్నా బాగుం టుందని వూహించుకుంటే వర్తమానం తెచ్చిన గాయాన్నిమర్చి పోవచ్చు. కానీ ఆ రోజు కలలాగా - నిన్నటి కన్నా హీనంగా దర్శనమిచ్చి,తనది పట్టివూహేనని యింత కన్నా పతనం తప్ప వున్నతి లేదని నిర్ధారణ కొచ్చి నప్పుడు, మనిషిలో వుండే



మమత, తడి అతి అవిరిగా మారిపోతుంది. అనూరాధలోకూడా ఈ మార్పులే వచ్చాయి.

అనూరాధ అత్తగారికి పక్షవాతంవచ్చి నాలుగేళ్ళయింది. అప్పటినుంచీ ఆవిడ కన్నీ మంచం మీదే జరుగుతున్నాయి. జబ్బు చేసిన కొద్ది రోజులు ముకుందరావు మందు యిప్పించాడు.

తరువాత డబ్బులేక మందుఆగిపోయింది. కాని, ఆ ముసిలావిడ - తన చావు మందు లేకపోవడం మూలంగానే వస్తున్నదని - కొడుకూ కోడలూ తన్ను మందు లేకుండా చంపాలని చూస్తున్నారని వూహించుకునేది. దాంతో యింటి పరిస్థితులు తెలుసున్నా డాక్టరనీ, మందులనీ జ్ఞాపకం వచ్చినప్పు డల్లా పలవరించి యేడ్వడం అలవాటు చేసుకుంది. అనూరాధ ఆవిడ యేడుపు వినలేక నీళ్ళలో వుప్పువేసి, వాముతేట కలిపి దొంగ మందులిచ్చి ఆవిడ నోరు కట్టేది చాలా రోజులు.

ఆత్మవంచన చేసుకోవడం ఆవిధంగా అలవాటయితే - దుర్భర దృశ్యాల్ని చూసి దిగ మింగు కోవడం మామగారు నేర్పారు.

ఆయన పూర్వంలో ఖర్చుకు అలవాటు పడ్డ మనిషి. ఇంట్లో పరిస్థితి మారినా, ఆయన చుట్ట మానలేదు. కాఫీ, చీట్ల పేకా లేకపోతే అసలే నిలదొక్కుకోలేడు.

అందుకే కొన్నిరోజులు కొడుకు జేబులు తడిమి పట్టుకు పోయేవాడు. లేక పోతే అట్లకాడతో ఆడవాళ్ళ పెట్టెలు తీసి పబ్బం గడుపుకునేవాడు. ఆఖరికి ఆయన్ని బీద రికం యెంతకి దిగ జార్చిందంటే, కొడుకు తెచ్చిన బియ్యంలో వొవంతు తువ్వాల్లో కట్టుకుని బజార్లో అమ్మేసేవాడు. లేకపోతే



"మా తాతయ్య నడవడానికి ఎందుకంత కష్టపడిపోతాడో ఇప్పుడు తెలిసింది."

చేతికి దొరికిన యిత్తడి చెంబో, వెండి గ్లాసో తాకట్టు పెట్టేసేవాడు.

ఇవన్నీ చూచి కూడా భర్తకి చెప్పలేక, కడుపులో దాచుకుని - భర్తకి తెలిసిన రోజున అతనితోపాటు కళ్ళల్లోనే కన్నీరు ఆపుకునేది.

కానైతే, సంవత్సరాల తరువాత యీ రోజు వొకళ్ళ నొకళ్ళు చూచుకుంటే ఆ భార్యా భర్తల్లో వోర్పు చచ్చిపోయిందని రుజువయింది. దాచుకున్న కావేషాలు, ఈర్ష్యలు, దారుణాలు శరీరంలో చోటులేక బయటకు రావడం మొదలు పెట్టాయి.

చాలా మంచిగా వుండాలని - అలాగే ప్రవర్తించాలని ప్రతీ మనిషి అనుకుంటాడు. కాని, ఆ మనిషి చెడుగా మారిపోయాడంటే పై కారణం వల్లనే అవుతుంది.

అందుకే అనూరాధా, ముకుందరావు- యెవరికి వారుగా ఆలోచించుకున్న రోజున ఆ యిల్లు ప్రశాంతంగానే వుండేది. కాని, యిద్దరూ యెదురుపడితే, అవసరాలు కలి

గితే. యేదోవిధంగా యెదుటి మనిషిని బాధ పెట్టి కొంచెం "రిలీఫ్" పొందాలనుకునే వారు.

"వంటయిందా"

"లేదు. బియ్యం లేవు. నిన్ననగా చెబితే తెచ్చారు గనకనా? ఈ సంసారం యేమిటో, నాకు మతిపోతోంది. ఈద లేక చచ్చిపోతున్నాను"....

"అబ్బబ్బా — నోరు మూసుకుంటావా లేదా? చావాలని నీకే కాదు. నాకూ వుంది. ఈ రోజు కాదు — యెనిమిదేళ్ళ క్రితం చచ్చిపోవాలనుకుని కోరుకున్నాను ...... చావనీకుండా గుదిబండలు మీరున్నారుగా. సీతమ్మ గారింట్లో తీసుకో బియ్యం.... రేపు గాని డబ్బు అందదు".

"ఏదైనా అంటే యిదీ భాగోతం.... నెల దాకీ యివ్వలేదని పాలవాడు మానే శాడు. ఇంటాయన అద్దెకోసం రెండు సార్లు వచ్చాడు. అరుస్తోంటే ఆఫీసుకు వెళ్ళి అరవమన్నాను..... మీ తమ్ముడు జీతం కట్టాలిట"

"నా దగ్గర దమ్మిడీ లేదు. చచ్చిపోతు న్నాను. వంట్లో రక్తం తప్పించి మరేం లేదు. అదైనా అమ్మి వాడి జీతం కడదా మంటే_నాకు నమ్మకంలేదు — నా రక్తం అమ్మకానికి కూడా పని చెయ్యదు. అవునులే.... మనం యేం బలమైన తిండి తింటున్నామని రక్తం బాగుండడానికి."

అనూరాధకు దోకువచ్చినంత పనైంది. వసారాలోకివెళ్లి క్షణం తరువాత తిరిగొస్తే భర్తలేడు. అక్కడే కూర్చుండి పోయింది కళ్లు మూసుకుని.

"మీరు ...." కళ్ళు తెరిచి చూసి "ఎవరు" అంది యెదురుగా కనిపిస్తున్న స్త్రీని చూసి.

"నా పేరు సుశీల" అంది వచ్చిన అమ్మాయి ..

సుశీల ముకుందరావు పనిచేసే ఆఫీసులో టైపిస్టుగా వుంటోంది. ఆ అమ్మాయి యేడాదినుంచి ముకుందరావుని ఆఫీసులో చూస్తోంది. అతని గత జీవితం గురించి సీనియర్ టైపిస్టు రాధ చెబుతుంటే సుశీల పని మరచి వింటూ వుండేది. రాధది ముకుందరావు పక్కయిల్లు కావడంవల్ల ఆ యింట్లో జరిగే సంఘటనలు యథాతథంగా చెప్తూంటే సుశీలకు ఆవేశం కల్గేది.

ముకుందరావు కష్టాలు వింటూ ఆఫీసులో యెవరూ నిజం అనుకోక పోగా _ పైగా కథలుగా చిత్రించి నవ్వు కుంటూంటే. తనని యెవరో అవమానిస్తోన్నట్టు తలంచు కునేది. తన మనసు మెత్తనిదని _ పైగా రచయిత్రి అవడం మూలంగా, కష్టాల్ని కథల్లోనే చిత్రించి, మామూలు వూహల్లోనే జీవిస్తున్న తను_వాస్తవాన్ని గుర్తించవలసి వచ్చేటప్పటికి, హృదయంలో జరిగే స్పందన అని తెలిసేది కాదు.

ఈ రోజు సుశీల ముకుందరావు యింటికి రావడానికి కారణం_నిన్నటి రోజు ఆయన రాజారావును పది రూపాయలు అప్పు పెట్ట మని_ఆ డబ్బుతో యింటికి బియ్యం తీసుకు వెళ్లాలని ప్రాధేయపడి అడిగితే _ రాజారావు యిచ్చిన జవాబే.

రాజారావుకు లేమి అంటే అసహ్యం. ఎదటి వ్యక్తి డబ్బుకోసం యిబ్బంది పడుతున్నాడంటే అతనికి వెర్రి ఆనందం కలుగుతుంది. తన జేబులో డబ్బుందీ





కూడా యివ్వలేదని తెలుసుకున్నప్పుడు అడగవచ్చిన వ్యక్తి మొహంలో వచ్చే మార్పులు అతన్ని వూహల్లో స్వర్గారోహణ చేయిస్తాయి. వీలైతే ఆ దౌర్భాగ్యుడి యింటికి చాటుగావెళ్ళి_అతను కార్చేకన్నీరు చూడ్డం పెద్ద అనుభవం అని చెప్పు కుంటాడు.

నిజానికి రాజారావు కూడా వో రచయితే. కవిత్వం వస్తోన్నప్పుడు _ తనలాంటి డబ్బున్న వాళ్ళు యీ విధంగా లేని వాళ్లని ఆదుకుని, తద్వారా దేశంలోకి సరఫరా అయ్యే కవిత్వాన్ని ఆపడం అవివేకం అని భావగీతాలు వ్రాస్తాడు.

సుశీలకు రాత్రి యింటికి వెళ్లి పడుకుంటే నిద్ర పట్టలేదు. కళ్ల ముందు ముకుంద రావు సంసారం, అతనికి విధి చేస్తున్న అన్యాయం, దానికి కారణాలు వూహిస్తూ వుండిపోయింది. గుండెల్లో బాధ తప్పించి ఆ కష్టాలకు కారకులుగాని, తుదీ మొదలు గాని కన్పించలేదు. ఉదయం మాత్రం వో పాతిక రూపాయలు పట్టుకుని రాగల్గింది. పరిచయంలేని ముకుందరావు యింటికి. ఆమెకు రాత్రికి తాత్కాలికంగా విశ్రాంతి నిచ్చింది యీ వూహే.

అనూరాధ మరోసారి సుశీలను పరకా యించి చూసింది. ఉదయం నుంచీ కాఫీ

---

● సొంత డబ్బాలో రాటుదేలిన రచనాసురుడొకడు థర్డ్‌క్లాస్ కంపార్ట్ మెంటులోచేరి అక్కడి అమాయక ప్రజలందరినీ_భీమాఏజెంటుకంటే కనాకష్టంగా చిత్రహింస పెడుతున్నాడు. పంక్చుయేషన్ లేకుండా అనర్గళంగా తన రచన లను గురించి, తనకుజరిగిన సన్మానాలను గురించి ఉపన్యసిస్తున్నాడు. మంత్రు లతో కరచాలనం చేస్తూ తీయించుకున్న ఫొటోలు, ప్రముఖులు తనకు రాసిన లేఖలు, అచ్చుఅయిన పుస్తకాలు, వాటిపై పత్రికలు రాపిన సమీక్షలు_పాముల బుట్టలాంటి బెడ్డింగులోంచి తీసి అందరికి పంచిపెడుతున్నాడు. కంపార్టుమెంటు ఖాళీగా వుందికదా ఎక్కుదామని వచ్చే ప్రయాణీకులు అల్లంతదూరాన్నే అతని సొంతడబ్బా విని కకావికలై పారిపోతున్నారు. ఓ ఇరవైమంది మాత్రం సాలె గూట్లో పురుగుల్లా అతనికి చిక్కిపోయి, సాహిత్య దుర్గంధాన్ని భరిస్తున్నారు. ఒక పుస్తకం చూచి ఇచ్చేస్తుంటే ఇంకో పుస్తకం ఇస్తున్నాడు. ఇదంతా చూసి చిరాకుపుట్టిన ఒక పెద్దమనిషి "అయ్యా ఒకసారి మీ పుస్తకాలు ఇస్తారా" అని అడిగాడు. ఇంతటి మహోదారుడెవరా అని ఆశ్చర్యపోయాడు రచనాసురుడు. ఒకటితర్వాత ఒకటిగా తనదగ్గరున్న పుస్తకాలు, కరపత్రాలూ, ఆల్బమ్‌లు అన్నీ ఇచ్చాడు: ఆ పెద్దమనిషి అన్నింటినీ జాగ్రత్తగా ఒళ్ళో పేర్చుకుని, దానిమీద తలపెట్టుకుని హాయిగా గుర్రుపెట్టి నిద్రపోయాడు. తెల్లారి లేచి 'థాంక్స్ సార్, దిండులేని లోటు తీర్చారు' అన్నాడు. ప్రయాణీకులందరూ ఆయనకి వందనసమర్పణ చేశారు.

లేక – లేచింది లేచినట్టే మొహం కడుక్కొని వుండిపోయింది. ఆ అమ్మాయిని చూడగానే యెడంచేత్తో జుట్టు సరిచేసుకుంది. చీర సర్దుకుంది.

"ముకుందరావు గారు లేరాండి" సుశీలకు చెయ్యాలనుకున్న సహాయానికి మార్గాంతరం వెంటనే తోచిందికాదు.... నెమ్మదిగా అంది.

"నిన్న ఆయన డబ్బు కావాలన్నారు.... వారుంటారేమో అనుకున్నాను. వచ్చాక యివ్వండి" అంది అనూరాధ చేతికి డబ్బిస్తూ....

నిజానికి సుశీల యింటి దగ్గర ఆలోచించుకు వచ్చింది. అనూరాధతో మాట్లాడాలని, చాలా రకాల ధైర్యం అందివ్వాలని.

కానీ – ఆ యింట్లో పాతిక సంవత్సరాలైనా నిండకుండా యెండి వొరుగైన అనూరాధను—మంచాన్ని హత్తుకుపోయి. చిరుగుల బొంత లాంటి, డొక్కు లాంటి ముసిలావిడను - లేమి వంట్లో ప్రవహిస్తూ నడవలేక విరిగిపోయిన వికారపు బొమ్మల్లాంటి పసివాళ్ళను – యే మూలా, వుత్సాహం, వుద్రేకం లేక–కాలి ఆరిపోయిన యింటి లాంటి ఆ వాతావరణాన్ని చూసేటప్పటికి, సుశీలకు యేం తోచింది కాదు .... ఎక్కువగా నిల్చుంటే యే భావనకు తట్టుకోవలసి వస్తుందోనని, తిరిగి వస్తానని చెప్పి వెళ్లిపోయింది ఆ అమ్మాయి. అనూరాధకు ఆ పూటకు యింట్లో ఆకలి పరిష్కారం కావడానికి మార్గం కన్పించడంతో – సుశీలతో మాట్లాడాలనే ధ్యాసే కలగలేదు.

పదిగంటలవరకూ భర్త యింటికి రాకపోవడంతో అనూరాధ భోజనంచేసి, పక్కింటి పిల్లాడ్ని పిలిచి, భర్తకు కబురు పంపించింది.

భోజనం ఫ్రెండ్ యింట్లో పూర్తి అయిందనీ. యేకంగా సాయంకాలం వస్తానని కబురు చేశాడు ముకుందరావు.

విశ్రాంతిగా చాపమీద పడుకున్న అనూరాధలో ఆలోచనలు కొత్తరకంగా నడిచాయి. స్త్రీ అవడం మూలంగానేమో శరీరంలో మరింత గట్టిగా హత్తుకుపోయాయి .... ....! సుశీల....ఆ అమ్మాయిగాని ఆయన్ని వలలో వేసుకోలేదుగదా. లేకపోతే యెందుకు సహాయం చేస్తుంది? పైగా యింటికికూడా వచ్చింది........

వెంటనే తన ఆకారం. సుశీలరూపం గుర్తుకు తెచ్చుకుంటే అనూరాధను ఈర్ష్యే జయించింది. దానికితోడు ఆరోజు ముకుందరావు యెనిమిది దాటితేగాని యింటికి తిరిగి రాలేదు.

"ఇల్లు గుర్తొచ్చిందా"

"అంటే"....

"మేం బ్రతికున్నామని మర్చిపోయారేమోనని"

"ఏదోవొకటి. యింటికి వచ్చేటప్పటికి మొదలుపెడతావేం?"

"అవును. ఆఫీసులో అయితే ప్రశాంతంగా వుంటుంది. కావల్సినంతమంది ఆడవాళ్లు"

"ఛీ. నోర్ముయ్"

"ఏదీలేకపోతే ఆ సుశీలకు మనంఅంటే అంత జాలి యెందుకు కలుగుతుంది? ఇంటికి కూడా వచ్చింది ..."

ముకుందరావు ఆ క్షణంలో నిలువునా కుంగిపోయాడు.

ఇదన్నమాట నీ ఉద్దేశం....నువ్వీపాటికి ఆకలితో చచ్చిపోయివుంటావని వూహిం





చాను. బ్రతికే వున్నావు. నన్ను చంపడం మొదలుపెట్టు యిక" అన్నాడు.

"అంతేగాని నా యేడుపు మీకు తెలియడం లేదు. నానా వాళ్ళతో తిరిగి...."

ముకుందరావు కొట్టాడు .... అనూరాధ యేడ్చి యేడ్చి నిద్రపోయింది. అయినా అతనికి నిద్రపట్టలేదు. చిరాకు విరక్తి అన్నీ మర్చిపోయి నక్షత్రాల వైపు చూస్తుంటే. అతనిలో - ఆ మగవాడిలో - యేదో శక్తి గొణుక్కుంది. "అవును, ఎవరికీ, ఆఖరికి భగవంతుడికి కూడా లేని ఆపేక్ష సుశీలకు తనమీదయెలాపుట్టింది?మధ్యాహ్నం యింటికి తీసుకువెళ్ళి, తను వోడిపోతున్నానని మనసులో అనుకుంటే - ఆ అమ్మాయి సరిగ్గా అదే వూహించినట్టు అలా యెలా వోదార్చగల్గింది? తాను అప్పుచేస్తే తీర్చలేనని తెలిసికూడా పాతికరూపాయలు తన యింటికి తీసుకువెళ్ళి ఎందుకు యిచ్చింది? ఏ భావం ఆ అమ్మాయిలో తనపట్ల కలిగి వుంటుంది? అనూరాధ అన్నట్టు"....

ఉదయానికి అనూరాధ వూహ-ముకుందరావు భావన అంతా భ్రమే అవుతుంది. మిగిలేది మాత్రం అర్థంకాని సుశీల ఔదార్యం వొక్కటే.

నిజం ఆలోచిస్తే చాలారోజులు ఆయింట్లో మిగిలి వుండేది బీదరికమే. తెల్లవారి లేచిన తరువాత సుశీల లాంటి వారి అభిమానం. ఆప్యాయతా, ఆ దంపతులకు - వానకూ యెండకూ తడిసి. మసిబారిన ఆ యింటికి అవసరమే అవుతాయి....

అయినా. మనిషి అన్నీ మర్చిపోయి తనని సృష్టించిన విధాతని ఆడిపోసుకుంటూన్నట్టే - అ దంపతులు అన్నీ పోగొట్టుకున్న విష క్షణంలో సుశీల లాంటివాళ్ళను అపార్థం చేసుకోవచ్చు ...

కానీ యీ కలల్లో యేదీ యథార్థంకాదని- వాస్తవం మర్చిపోవడం కోసం కలల్లో ఆనందాలు. కష్టలూ వూహించుకునే సాధారణ మానవుల మనసు కొలమానం అని తెలుసుకుంటే - జాలి. ఆపేక్ష. ఆవేదన అన్నీ కలుగుతాయి....క్షమించాలనీ అనిపిస్తుంది. అలా క్షమించగలిగితేనే వారిని చీకటిలోంచి వెలుగులోకి రప్పించగలమేమో. □□□

## మిథ్యాక్కరలు

"విశ్వనాథ సత్యనారాయణ గారు రామాయణ కల్పవృక్షంలో మధ్యాక్కరలు మొదలైన అక్కరలు ఎందుకు రాశారో తెలుసా?"

"తెలియదు"

"లేక పోతే అది అక్కరలేని రామాయణం అవుతుందని."

—పన్నేశ్వరరావు. మద్రాసు